# వ్యవహారం

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు.

“ఇందుకా పేరంటానికి పిలవడానికి వచ్చిన పేరమ్మ గారితో బారలూ, మూరలూ చాపి, కళ్లు త్రిప్పుతూ చెప్పుకుంటున్నావేమిటే పద్మం!”

“అబ్బే, నేనేమిచెప్పాను? ఏమీలేదే.”

“చెప్పి, చెప్పలేదంటూవేమిటి? నేనీగోడచాట్నుంచి నీ తీర్పులూ, నీ రాగాలూ, నీ నీతులూ వినలేదనుకున్నావా?”

“రాగాలూ, నీతులూనా?”

“ఆఁ. సన్నాయినొక్కులూ, సెబాసులూనూ.”

“ఉఁ. ఇంకా ఏమిటో చెప్పూ!”

“చెప్పొస్తే చాలా ఉన్నాయి. నేనన్నీ వింటూనే ఉన్నాను. ఈ చెప్పుకోనడం నీవప్పిడే నాలుగైదుమాసాలై మొదలెట్టావు. వింటున్నా. అదేపాయని ఊరుకున్నా నింత వరకూను. నేనూరుకుంటూన్న కొద్దీ నీమూతి విరుపులూ, నీ సకిలింపులూ హెచ్చైపోతున్నాయి.”

“నా తిప్పలూ, నా తిరుగుళ్లతో నీకేమైనా పనుందా?”

“ఆఁ. పనుంది కాబట్టే, అడగడం వచ్చింది. మీకు మేం చేసిన అన్యాయమేమిటీ? ప్రతీ చావాటి వెధవ దగ్గరా యాగీ చేస్తున్నావు.”

“విన్నవాళ్లుకూడా వెధవలే?”

“ఆహాఁ. ముమ్మాటికీని. చెప్పకునే ముండలికి బుద్ధి లేకపోతే, వినేముండలికేనా వివేకం ఉండొద్దూ?”

“మాటలు తిన్నగారానీ; ఇది మన ఊరేం కాదు. ఆడిందాటా, పాడిందిపాటా కావడానికి. జాగ్రత్త.”

“ఏం, పేద్ద ఆరిందాలా జాగ్రత్తంటున్నావు. నన్నిక్కడేం తలకొట్టి మొలేస్తావా నువ్వూ? నాకేవ్వూరైనా వొహాటే. దీనికేం కొమ్ములేవు.”

“మమ్మల్ని గంగలోదింపి, ఇంకా కేకలేస్తున్నావా? ఇంత అన్యాయం చేస్తావన్న సంగతి ముందు తెలిసుంటే బాగానే ఉండేదాన్ని. ఇల్లా జరుగునా?”

“నీకు జరిగేదీ లేదు, ఒరిగేదీ లేదుకాని, నిన్ను గంగలో ఎవరు దింపారు? నీకు నీవే దిగావు.”

“నేను దిగలేదు. నీ దింపావు ముమ్మాటికీ.”

“ముమ్మాటికీ దింపానా? దింపితే, ఇప్పుడు నీకొచ్చిన వురేమిటీ?”

“ఉరేమిటని నెమ్మదిగా అడుగుతున్నావా? అంతా వురే. నీ మూలంగా గోదారిలో దిగాం. ఏడూ ఏణ్ణర్థం కావొస్తోంది. ఇప్పటికికానీ చేతికివ్వలేదు. తెచ్చుకున్నదంతా తినేశాం. పైగా వస్తువులు తాకట్టుపెట్టుకున్నాం. తిండికి ఈ రేపను రోజుల్లో నానాబాధలూ పడుతున్నాం. పిల్లాడికీ ఓ చదువూ, సంధ్యా లేదుకదా. ఒకే ఇంట్లో ఉందామనీ, అంతా నీదేననీ, నా సమస్త చాకిరీలూ చేస్తాననీ, ఇంకా ఏమిటోచెప్పి, అరచేతిలో స్వర్గం చూపించావు. ఆడిందంతా అబద్ధం కాదనుకున్నాను.

“ఉఁ. ఇంకా ఏకరుపెట్టు. అలా అంతతో ఏడుస్తూ ఆగిపోయావెందుకూ?”

“ఇంకేం చెప్పాలి. ఇవి చాలవూ? కట్ట గుడ్డా, తిండానికి తిండీ నీ మూలంగా కరువైపోయింది. ఇల్లద్దికూడా తగిలించావు.పిల్లల గోడంతా చెరిపావు. కంపెనీలో డబ్బంతా నీ వాళ్లో పడేసుకుంటున్నావు. పూటబత్తెం, పుల్లెలుగా అయిపోయింది కాపురం! ఇంతకీ నా ఖర్మం. ఒహర్ననవలసిన పనిలేదు.”

“అయిందా నువ్వు చెప్పడం! దెప్పడమూను. ఇదిగో; ఇంట్లో పడేసుకుంటున్నావు. ఏ వెధవలేం చెప్పిపెట్టారో కంపెనీ ప్రొప్రయిటరు చంద్రంగారు ఇంట్లో బసా, భోజనం మానేశారు. పైగా నేనేదో చెప్పానని ముందుకాళ్లు బందాలేస్తున్నావు. నేను చెప్పగానే నీవీ వ్యాపారంలో దిగలేదు. నీ మూలంగా మొగాళ్లకీ, మొగాళ్లకీ మాటలపోయాయి. జ్ఞాపకం తెచ్చుకోసరిగ్గా. ఇంక నోరుముయ్యి నీకంటే హెచ్చెవళ్లూ తినలేదిక్కడ. దీనికి రాగాలూ

మూర్ఛలూనా ? కంపెనీలో ఏం వస్తూందో మీ ఆయన్నే అడిగి తెలుసుకో లేకపోయావా ? ఊళ్లో వాళ్లు బోలెడు షాపులుపెట్టి పనిచేస్తూంటే క్రొత్తగా పెట్టిన మన కంపెనీ కప్పుడే ఎవరు వస్తారనుకున్నావు ? పాతపడాలి. పేరు రావాలి. అందాకా ఆగాలి. లేకపోతే పోవాలి. డబ్బు దోళ్లదోపిడిగా వస్తుందనే ఆశతో వ్యాపారంలోకి దిగీ, నన్ను దుమ్మెత్తి పోస్తావేమోఘంరా ! నీ మొగుణ్ణి వ్యవహారంలోకి దిగమని నేనా నువ్వా చెప్పావు. నీవే ఆమోదించావు. నీవాయనతో మాట్లాడమంటే మాటాడాను. తెలుసా ? ”

“ నీమాటలునమ్మి కావలసినవాళ్లతో కయ్యంపెట్టుకున్నాను. స్వేచ్ఛంటే తగులడిపోయే స్వేచ్ఛ వచ్చింది. బేడవులు మాటలాడకే మనుకున్నావో. వచ్చినప్పట్నుంచీ నూటీపోటీమాటలాడుతూనే ఉన్నావు. ఇంతేనా. ఇంకా ఏమైనా చేస్తావా ? నీకూ ఉన్నాయి కావలసినన్ని అవుకులు. తవుడుతింటూ దాగరమూ తెందుకూ ? మాటకిమాట తెగులు, నీటికి నాచు తెగులూను. అంతే ; దేనిమీదో రాయేస్తే మొగమంతా అయిందట ! ఇంక నాతో నీకేం పనీ. నామూలంగా నీకేనష్టమూ రాలేదు. పోలేదు. నీ మూలంగా నాకు నష్టంవచ్చి పోతున్నాను. నా డబ్బు నా కిచ్చేయి ఇప్పుడే పోతాను. మా అక్షయపాత్ర మాకేవుంది.

“నీకేమిటోచెప్పి, నిన్ను చెడిపానంటున్నావా? నే చెప్పగానే విని చేయడానికి చిన్నకూచివా నీవూ ? నాకున్న వయస్సే నీకూ ఉంది ముష్ఠై. బుద్ధి పూర్వకంగాదిగీ, ఎవర్నంటూవే చవటా! నా అవుకుల్తో నీకేమీ పనిలేదు. నా దొప్ప కారకుండా నేను చూసుకున్నా. నీ సంగతి జాగ్రత్తగా చూసుకో. నీ డబ్బుసంగతి మమ్మల్నేమీ అడగనక్కరలేదు. చంద్రంగారి పూచీమీద మదుపెట్టానని మొన్న మా యింట్లో తద్దినం నాడు మీ ఆయన కచ్చితంగా చెప్పాడు. నీవూ విన్నావు. ఇహ మా పూచీ ఏమిటీ ? మీరాయన్నే అడగొచ్చు. మొగాళ్లకజ్జాల్నాడదీ తెగిపోయింది. నీలాగే మాదీ ఒకవంతే. ఇంకెవరికి వారే యమునాతీరే. తెలుసా ? నీలాంటి మొహాల్తో, కాదు, పీనుగుల్తో వ్యాపారం యేమిటీ?”

“ పీనుగూ గీనుగూ అంటూ పదేపదే అనకు. ఎవరు పీనుగులూ. నీవే పీనుగువి. ఎవర్నంటావు ? ఎవర్నంటే ఎవరు పడతారనుకున్నావు ? వెధవ మొహం ఆడించుకుని. ఛీ. ఛీ. ఛీ. నీముఖంచూస్తే పాపంకూడా వస్తుంది.”

“ ఆఁ. ఏమంటావు ? పళ్లూడకొడతాను జాగ్రత్తగా మసులుకో. నోరు సరిచేసుకో. అల్లా లేచిపోతున్నావేం. తలుపు బిడాయించుకుంటున్నావు. నిలబడు నీ సంగతి చెపుతాను. ఛూ. ఛూ. ఛూ. పో. చాల్లేని గాడిదా ! ఇంకే మొహంపెట్టుకు నన్ను చూస్తావే ! ఈవేళతో నీకూనాకూ నీళ్లధారే. పోతేపోతావు. నాకేమీ తృణతలేదు. ఎవళ్ల కర్మకెవళ్లు కర్తలూ ? ఎందుకోఅందుకు వచ్చినప్పట్నుంచీ రాగాలే. ఛీ. దీని సబ్బులూ, దీని పౌడర్లూ, దీని స్నోలకే అయిపోయింది సంసారమంతా. ఇంక సంసారం ఎల్లా సాగుతుంది ? ఈ అందాలగొండికి అక్కర్లేనిదంటూలేదు. వంతు తీసుకుని ఎన్నడూ వ్యవహారం చెయ్యకూడదు బాబూ ! అందులో ఇలాంటివాళ్లతోటా ? అమ్మమ్మా !! దీని పేచీలతో సర్వం నాశనం అయిపోయింది. మాటాడడానికంటూ నెమ్మదిగావచ్చి, చివరికి దెబ్బలాటతో లేచిపోతుంది. ఇలాంటి ఆడదాన్నెక్కడా చూడలేదు. ఇంటివాళ్లతో చెప్పి, యింక యీ గుమ్మాన్ని ఇంట్లోకి రాకుండా గుమ్మానికి మేకులు కొట్టించాలి. ఒక్కొక్క ఆడది యెంతకేనా తగును. దీనితో ఎప్పుడు మాటాడినా గుండెల్లో వగర్పు వస్తుంది. చాల్లేను. అటు ఎవ్వరో తలుపు బాదేస్తున్నారు ; మొహంకాల్చా. ఇంట్లోకి ఇది రాకుండా ప్రస్తుతం మధ్య తలుపు గడివేసేస్తా. పోతాను వాళ్లకి తలుపు తియ్యాలి. వస్తున్నానండీ ! బాబూ ! ”